క్లుప్తంగా

నగరానికి విచ్చేసిన గోవిందా నంద సరస్వతి స్వామీజీ



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్వారక, శ్రీబదరి పీఠాధిపతి స్వరూపానంద సరస్వతి స్వామీజీ శిష్యులు గోవిందానంద సరస్వతి స్వామీజీ సోమవారం ఏలూరు నగరానికి విచ్చేశారు. కంచికామకోటి హేలాపురి సంస్కృతవేద స్మార్త ప్రయోగ పాఠశాల అధ్యక్షుడు ఈదర వేంకట రమణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి తూములూరి విశ్వనాథ శాస్త్రి, కోశాధికారి తమ్మెర రామారావు తదితరులు స్వామీజీకి స్వాగతం పలికారు. సంస్కృత పాఠశాలలోని అమ్మవారిని స్వామీజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

స్పందన ఫిర్యాదుపై తహసీల్దార్ విచారణ



భూమి పరిశీలిస్తున్న తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్: మాదేపల్లిలో అనుమతుల్లేకుండా లెవెలింగ్ పనులు చేస్తున్న భూమిని ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ సోమవారం పరిశీలించారు. ముప్వ శ్రీదేవి అనే మహిళ స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులకు చేసిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ క్షేత్రస్థాయిలో 20 సెంట్ల భూమిని పరిశీలించారు. భూమి యజమాని ముప్వ రాంబాబు తదితరులతో పాటు ఫిర్యాదురాలు సమక్షంలో భూమి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమతులు తీసుకున్న తర్వాతే మెరక పనులు చేపట్టాలని సూచించారు. పత్రాలు పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత నివేదిక రూపొందిస్తామన్నారు. ఆయన వెంట వీఆర్వో, గ్రామ సిబ్బంది ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి

ఏలూరు (టూటౌన్): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరం కోరుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం జర్నలిస్టు డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌లు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని, మీడియా కమిటీ ఏర్పాటు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. తొలుత జిల్లా సమాచార శాఖ కార్యాలయం వద్ద ప్రదర్శన చేశారు. పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

అడ్డదారుల్లో అధికారం చంద్రబాబు నైజం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి
- ఏలూరు మండల వలంటీర్లకు సత్కారం





జెడ్పీ సమావేశం మందిరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, దూలం నాగేశ్వరరావు, వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: అడ్డదారుల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం ప్రతిపక్షనేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన సోమవారం ఏలూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో వలంటీర్ల వందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబు రుణమాఫీ పేరుతో డ్వాక్రా సంఘాల మహిళలను అప్పులపాలు చేశాడని వివరించారు. 2024లో అధికారం కోసం మహిళా శక్తి పేరుతో అక్కచెల్లెమ్మలను మోసం చేసేందుకు సిద్ధపడుతున్నాడని అన్నారు. మూడుసార్లు సీఎంగా పనిచేశానంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నాలుగేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను కాపీ కొట్టడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో 660 హామీలు ఇచ్చి, ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాడని గుర్తుచేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని చెప్పారు. ఏటా రూ.12 వేలు రైతుల ఖాతాల్లో వేసి వ్యవసాయాన్ని పండుగ చేశారని తెలిపారు. మ్యానిఫెస్టో అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా అని చంద్రబాబుకు అబ్బయ్యచౌదరి సవాల్ విసిరారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ నీతి, నిజాయితీతో కూడిన పాలన అందించాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేశారని కొనియాడారు. వలంటీర్లు జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు వన్నె తెచ్చారని కొనియాడారు.

వలంటీర్లు జగనన్న సైన్యం

రానున్న ఎన్నికల్లో వలంటీర్లే జగనన్న సైన్యం అని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కొనియాడారు. టీడీపీ నేతలు జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలంటే, ముందుగా వలంటీర్లను ఓడించాలన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు లెక్క చేయకుండా ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేసిన వలంటీర్లపైనా చంద్రబాబు అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పచ్చనేతలు అక్రమాలకు పాల్పడితే, వైఎస్సార్‌సీపీ హయాంలో యువత వలంటీర్లుగా ప్రజా సేవ చేస్తున్నారని కొనియాడారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందించే జగన్‌మోహన్‌రెడ్డి పాలన గొప్పదా, జన్మభూమి కమిటీల పేరుతో వర్గ, భేదం సృష్టించే చంద్రబాబు పాలన గొప్పదో ప్రజలే తేల్చుతారని చెప్పారు. ఈ సందర్భంగా ఏలూరు మండలంలోని వలంటీర్లకు అవార్డులు అందజేశారు. నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యేలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మండల సరస్వతి, పెనుమాల విజయ్‌బాబుతో పాటు గంటా ప్రసాదరావు, ఏఎంసీ దెందులూరు చైర్మన్ అప్పన ప్రసాద్, మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, వడ్డీ కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు



సీపీఎం అమర వీరుల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రజా ఉద్యమాల్లో ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక చోడిదిబ్బ, నర్రా అజంనేయులు గ్రంథాలయం వద్ద సోమవారం సీపీఎం అమర వీరుల వర్ధంతి సభ సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. పీడిత ప్రజానీకం కోసం ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఏలూరుకు చెందిన నర్రా ఆంజనేయులు, బూరాడ అప్పారావు, తాన సింహాచలం ధన్య జీవులని రవి గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కంది విశ్వనాథం, చింతాడ వెంకటలక్ష్మి, సాయిబాబు, వైఎస్ కనకారావు, జె.గోపి, ఎం.ఇస్సాకు, జి.కోటేశ్వరరావు, మీసాల సత్యం, బొత్స సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్య సమరయోధులు సంకు అప్పారావు, కనకం బసవరాజుల పోరాటాల స్ఫూర్తితో రైతాంగ, చేనేత, కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సీపీఐ కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపు నిచ్చారు. స్థానిక 36వ డివిజన్‌లో అప్పారావు, బసవరాజుల స్మారక స్థూపాల వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కడుపు కన్నయ్య, తమ్మా విశ్వేశ్వరరావు, గేదెల నాగేశ్వరరావు,యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్మోహన్‌రావు, బుగ్గల ప్రభాకర్, పోలా భాస్కర్, బేత శంకర్, ఎస్.సంజీవరావు, కనకం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెన్యూర్ ఏపీపీల వేతనాల పెంపుదలకు కృషి



డీవోపీ సదుర్శన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీపీలు

ఏలూరు (టూటౌన్): జిల్లా, సబ్ కోర్టుల్లో పనిచేసే అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (టెన్యూర్ ఏపీపీలు) జీత భత్యాలు పెంపుదలకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ (డీవోపీ) జెల్లా సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారని ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆచంట వెంకటేశ్వరరావు తెలిపారు. తమ అసోసియేషన్ తరుపున తాడేపల్లిలో డీవోపీ సుదర్శన్ రెడ్డిని కలిసి సోమవారం వినతి పత్రం అందజేశామన్నారు. టెన్యూర్ ఏపీపీలకు క్యాడర్ ఏపీపీలతో సమానంగా వేతనాలు పెంచాలని, జిల్లా కోర్టు ఏపీపీలకు రూ.40 వేల నుంచి రూ.లక్షకు, సబ్ కోర్టు ఏపీపీలకు రూ.25 వేల నుంచి రూ.60 వేలకు అన్ని రకాల అలవెన్స్‌లతో కలిపి జీతభత్యాలు పెంచాలని కోరామని తెలిపారు. సుదర్శన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకె వెళతానని చెప్పారని వివరించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు డీవీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చదరంగం క్రీడతో మేధోశక్తి పెంపు



విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందించిన జెడ్పీటీసీ భవానీ రంగ తదితరులు

భీమడోలు : చదరంగం క్రీడతో మేధోశక్తి పెంపొందించుకోవచ్చునని, ఈ క్రీడపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలని జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలులో ఆదివారం రాత్రి ఏలూరు జిల్లా అండర్ 19 ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ 2023 టోర్నమెంట్ నిర్వహించారు. జెడ్పీటీసీ భవానీ రంగ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ మొదటి పాము కదిపి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఏలూరు జిల్లా స్థాయిలో 48 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం వివేష్ చొప్ప(ఏలూరు), ద్వితీయ స్థానం సుచితా క్రిష్టి (ఏలూరు), తృతీయ స్థానం త్రిశాంక్ కోటి (భీమడోలు), నాల్గవ స్థానం బబ్లీ బాల(ఏలూరు) సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డైరెక్టర్ ఎస్.కోటేశ్వరరావు టోర్నమెంట్‌ను పర్యవేక్షించారు. సహాయకులుగా శ్యామల, వి.రత్నకిషోర్ వ్యవహరించారు. జూన్ 8న నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ఏలూరు జిల్లా నుంచి ఈ నలుగురు హాజరవుతారని చీఫ్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్ పాలూరి ప్రకటించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెదవేగి : పెదవేగి మండలం ముండూరులో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం పర్యటించనున్నారని మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్ చెప్పారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3:30 గంటలకు ముండూరులోని ప్రాథమిక హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 4 నుంచి ముండూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న పరంజ్యోతి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా బీఎస్పీని బలోపేతం చేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి అన్నారు. స్థానిక కొత్త రోడ్డులో గల నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో సోమవారం ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. బీఎస్పీ ఏలూరు నియోజకవర్గానికి కలపాల రవి, దెందులూరు నియోజకవర్గానికి కర్రే అంబేడ్కర్‌ను ఇన్‌చార్జిలుగా నియమించినట్టు ప్రకటించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ గుమ్మాపు చిత్ర సేన్ మాట్లాడుతూ రాబోయే 2024 ఎన్నికల్లో ఇతర పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీఎస్పీ ఎదుగుతుందని తెలిపారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నేతల రమేష్ బాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో బీఎస్పీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గరికిముక్క వెంకటేశ్వరరావు, భూపతి అప్పారావు, మేడిశెట్టి గిరిబాబు, పోసి మణి, చాట్ల శ్రీనివాసరావు, పుట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	26	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	00	ములక్కాడలు	05-07
బెండకాయలు	16	కంద	58
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	34
కాకర కాయలు	44	కీరా దోస	40
బీరకాయలు	18	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	22	అల్లం	220
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	16	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	14	బఠాణి	--
అనబకాయ (1)	10	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	17
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	15
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	09
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	26
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు -తిరుపతి	16.00	4830	36

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు: పోతునూరులో కోదండ రామాలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమ వారం వైభవంగా సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ అవరణలో కమిటీ ఆధ్వర్యంలో అభిషేకాలు,హోమాలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కోదండ రామాలయ ఆవరణలో గోమాతకు పూజలు చేశారు. సొసైటీ చైర్మన్ డీఎస్‌పీడీ ప్రసాద్ (బజ్జీ), రమాదేవి, సర్పంచ్ బోదుల స్వరూప్, గూడపాటి పవన్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐదుగురికి నోటీసుల జారీ

దెందులూరు: పోతునూరులో తనకు నాలుగెకరాల భూమి ఉందని ఆ గ్రామానికి చెందిన ఆడారి కనక విజయలక్ష్మి అధికారులకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై గతంలో అదే గ్రామానికి చెందిన వేగి వీరబాపూజీ, బొడ్డేటి కోటేశ్వరరావు కలిసి ఏలూరు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి విజయలక్ష్మికి భూమి లేదని, ఫోర్జరీ పట్టా పొందారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు అధికారులు విచారణకు ఆదేశాలిచ్చారు. జూన్ 3న ఉదయం 11 గంటలకు ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే విచారణకు విజయలక్ష్మి, వీరబాపూజీ, కోటేశ్వరరావు, వీఆర్వోలు శ్రీనివాసరావు, నాగరాజు హాజరుకావాలని ఆర్డీవో సోమ వారం నోటీసులు జారీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

దెందులూరు: ప్రజల సమస్యల పరిష్కార వేదికగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ప్రజాప్రతినిధులు నేరుగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యను తెలుసుకుని పరిష్కరించడం మన రాష్ట్రంలో మాత్రమే జరుగుతోందని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైద్యం, ఇంటి స్థలం, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, రుణాలు, ఇతర సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను స్థానికులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అహర్నిశలు బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, పార్టీ నాయకులు బోయపాటి గణేష్, ముసునూరి వెంకటేశ్వరరావు, తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, వలంటీర్లు, ఉద్యోగులు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గణపవరం : డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గణపవరం మండల డ్వాక్రా యానిమేటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి వినతిపత్రాన్ని అధికారికి అందచేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి పి.గోవింద్, తోట పద్మావతి, ఎలిపే సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

దెందులూరు: జాతీయ రహదారిపై సత్యనారాయణపురం వద్ద సోమవారం బొగ్గు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. మహారాష్ట్ర నుంచి పశ్చిమ బెంగాల్ వెళ్తున్న లారీ అదుపు తప్పి సత్యనారాయణపురం వాగులో పడిపోవడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

రహదారి పరిశీలన

పెదపాడు: ఏపూరు, అప్పనవీడులోని జగనన్న హౌసింగ్ కాలనీకి వెళ్లే రహదారిని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, తహసీల్దార్ జీ విజ యకుమార్ రాజు పరిశీలించారు. రహదారిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.